సాక్షి
నిజామాబాద్
బుధవారం । 2 । అక్టోబర్ । 2024



బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

జిల్లాలోని పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు.

- 11లో ▸



నాణ్యమైన విద్యుత్..

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్ఈ రవీందర్ సిబ్బందికి సూచించారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.8 /22.8

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా శరత్

నిజామాబాద్‌అర్బన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా ఐఏఎస్ అధికారి శరత్‌ను ప్రభుత్వం మంగళవారం నియమించింది. ఆయన ప్రస్తుతం ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీగా పనిచేస్తున్నారు. ఇకపై ఉమ్మడి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్‌గా కొనసాగనున్నారు.

'సమాచారం వస్తేనే వెరిఫికేషన్‌కు రావాలి'

నిజామాబాద్‌అర్బన్: డీఎస్సీ ఫలితాల్లో ఎంపికై నట్లు ఎస్ఎంఎస్, మెయిల్ ద్వారా సమాచారం వస్తేనే ధ్రువపత్రాల పరిశీలనకు రావాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన నగరంలోని నిర్మల హృదయ పాఠశాలలో ఈనెల 5 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అన్ని ఒరిజినల్ ధ్రువ పత్రాలతో పాటు గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించిన రెండు జతల జిరాక్స్ కాపీలను తీసుకురావాల్సి ఉంటుందన్నారు.

ఏవో నుంచి విముక్తి కల్పించండి



రెంజల్: ఏవో లక్ష్మీకాంత్‌రెడ్డి నుంచి విముక్తి కల్పించాలని మండలంలోని ఎరువులు, విత్తనాలు, పెస్టిసైడ్ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు అధికారులను కోరారు. మంగళవారం మండలంలోని బోర్గాం గ్రామంలో వారు మాట్లాడారు. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే కేసులు నమోదు చేస్తానని ఏవో బెదిరించేవాడని ఆరోపించారు. ఏవోకు పలువురు డీలర్లు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రూ.ఐదు వేల నుండి రూ.60 వేల వరకు పంపిన జిరాక్స్‌లను చూపారు. ఏవోపై పూర్తి ఆధారాలతో జిల్లా అధికారులతో పాటు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఏవో తీరుకు నిరసనగా మంగళవారం షాపులను మూసివేసి బంద్ పాటించారు. సమావేశంలో డీలర్లు కార్తీక్, అమీర్‌బేగ్, శివకుమార్, మోహన్‌రెడ్డి, రమేష్, సతీష్ నాగరాజు, ఇమ్రాన్, ఆరీఫోద్దిన్ పాల్గొన్నారు.

ఏవోపై చర్యలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యవసాయాధికారిపై ఆరోపణలు చేసిన రెంజల్ ఏవో లక్ష్మీకాంత్‌రెడ్డిపై శాఖపరమైన చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయనను రెంజల్ మండలం నుంచి తప్పించి యథాస్థానమైన బోధన్ మట్టి పరీక్షల నమూనా కేంద్రానికి బదిలీ చేశారు. డీఏవోపై ఆరోపణలు చేసిన రోజే రెంజల్ మండలానికి చెందిన డీలర్లు కొందరు ఏవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఏకంగా దుకాణాలు మూసి ఉంచారు. ఇటు తనపై ఏవో చేసిన ఆరోపణలల్లో నిజం లేదని డీఏవో వాజిద్ హుస్సేన్ పేర్కొన్నారు.

బస్టాండ్‌లో బస్సులు ఎక్కడానికి గుమిగూడిన విద్యార్థులు, తల్లిదండ్రులు



పండుగకు సొంతూరికి..

విద్యా సంస్థలకు బుధవారం నుంచి దసరా సెలవులు కావడంతో హాస్టళ్లలో ఉండే విద్యార్థులు సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో మంగళవారం నగరంలోని బస్టాండ్ విద్యార్థులతో కిటకిటలాడింది. బస్సుల్లో సీట్ల కోసం విద్యార్థులు పోటీ పడ్డారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





హాస్టళ్ల నుంచి సామగ్రితో బస్టాండ్‌కు వస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



గాంధీ తాత కుట్టుమిషన్

- ఇప్పటికీ చెక్కుచెదరకుండా పనిచేస్తున్న 1945 నాటి కుట్టుమిషన్
- స్వాతంత్య్ర ఉద్యమంలో 'విదేశీ వస్త్ర బహిష్కరణ'లో భాగంగా పంపిణీ
- ఈ మిషన్ ద్వారా ఇప్పటి వరకు 4 వేల మందికి శిక్షణ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: గాంధీజీ.. ఈ పేరు వింటేనే ప్రతిఒక్కరికీ స్వాతంత్య్ర ఉద్యమం గురించి ఆలోచన వస్తుంది. నాటి ఉద్యమంలో భాగంగా బ్రిటిష్ వాళ్లకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమాల్లో 'విదేశీ వస్త్ర బహిష్కరణ' ముఖ్యమైనది. బ్రిటిష్ వలస రాజ్యంగా ఉన్న భారతదేశం నుంచి ముడిసరుకును తీసుకెళ్లి ఇంగ్లండ్‌లో వస్త్రాలు తయారు చేసి మళ్లీ మనదేశానికి దిగుమతి చేసి ఎక్కువ ధరలకు అమ్ముకునేవారు. దీంతో గాంధీజీ ఈ ఉద్యమాన్ని మొదలుపెట్టారు. ఈ సహకార ఉద్యమంలో భాగంగా దేశవ్యాప్తంగా అనేక గ్రామాల్లోని వారికి రాట్నం (చరఖా), కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఇలా గాంధీజీ ఆధ్వర్యంలో సిరిసిల్లలోనూ 1945లో 50 మందికి రాట్నం, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అలా వచ్చిన కుట్టుమిషన్లలోని ఒక కుట్టుమిషన్ ఇప్పటికీ నిజామాబాద్‌లో వేలమందికి శిక్షణ ఇవ్వడంలో తనవంతు పాత్ర పోషిస్తుండడం విశేషం. బుధవారం గాంధీజయంతి నేపథ్యంలో ఈ కుట్టుమిషన్ నేపథ్యంపై కథనం.

■ తెలంగాణ ప్రాంతం నైజాం ఏలుబడిలో ఉన్నప్పటికీ భారత స్వాతంత్య్ర ఉద్యమంలో భాగంగా గాంధీజీ, ఇతర జాతీయ నాయకులు పర్యటించేవారు. ఈ క్రమంలో 1945లో సిరిసిల్లాకు చెందిన తమ్మం రత్నమ్మ అనే మహిళకు సైతం విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలో భాగంగా గాంధీజీ ఆధ్వర్యంలో కుట్టుమిషన్, రాట్నం ఇచ్చారు. ఇలా అందుకున్న కుట్టుమిషన్ ద్వారా ఈ కుటుంబానికి వరుసగా మూడు తరాలు ఉపాధి లభించడం గమనార్హం. 2003లో రత్నమ్మ మరణించింది. ఆమె మరణించక ముందు ఈ కుట్టుమిషన్‌ను రత్నమ్మ కుమారుడు తమ్మం భాషకార్లు, నప్పినమ్మలు వస్త్రాలు కుట్టారు. ఈ మిషన్ వీళ్ల కుటుంబానికి జీవనోపాధి కల్పించింది. దీని ద్వారా వచ్చిన ఆదాయంతోనే పిల్లలను చదివించారు. తమ్మం భాషకార్లు, నప్పినమ్మకు ముగ్గురు కుమారులు ప్రస్తుతం వీరిలో మొదటి సంతానమైన కృష్ణమూర్తి బెంగళూరు ఇస్రోలో సైంటిస్ట్‌గా, రెండో కుమారుడు నరసింహస్వామి డాక్టర్‌గా, మూడో కుమారుడు శ్రీనివాస్ ఇరిగేషన్ ఎస్ఈగా పనిచేస్తున్నారు. వీరి తోబుట్టువులు గోపిక, రాధిక సైతం ఈ కుట్టుమిషన్‌పై వస్త్రాలు కుట్టడం గమనార్హం. గోపిక కుటుంబంతో కలిసి నిజామాబాద్‌లో స్థిరపడ్డారు. 2003 తర్వాత కొన్ని నెలల పాటు ఈ కుట్టుమిషన్ మూలకు పెట్టారు. అనంతరం భాషకార్లు, నప్పినమ్మ పెద్ద కుమార్తె గోపిక ఈ కుట్టుమిషన్‌తో నిజామాబాద్‌లో 'శిక్షణ' ప్రారంభించారు. ఎప్పటికప్పుడు ఆయిలింగ్ చేయడంతో పాటు అవసరమైనప్పుడు బేరింగ్ మార్చుతూ వస్తున్న ఈ మిషన్‌కు ఇప్పటివరకు ఏమాత్రం మరమ్మతులు రాకపోవడం విశేషం.



విదేశీ వస్త్ర బహిష్కరణలో భాగంగా ఇచ్చిన కుట్టు మిషన్



మిషన్ కుడుతున్న అయ్యవారు గోపిక

అయ్యవారు గోపిక (రత్నమ్మ మనవరాలు) 1991లో టైలరింగ్ టెక్నికల్ కోర్సు పూర్తి చేశారు. ఉద్యోగం రాకపోవడంతో 2003లో నిజామాబాద్‌లో 'కపిల మహిళా సొసైటీ' పేరిట ఎన్‌జీవో ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా ఇప్పటి వరకు

4 వేల మందికి శిక్షణ

4 వేల మందికి కుట్టుమిషన్ ద్వారా సర్టిఫికెట్ కోర్సుల శిక్షణ ఇచ్చారు. దీంతో చాలామంది మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు. ఎంఎస్‌ఎంఈ, నాబార్డ్, నెహ్రూ యువ కేంద్ర, ఖాదీ గ్రామోద్యోగ్ మహావిద్యాలయ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన తదితర పథకాల కింద శిక్షణ ఇస్తున్నారు. గోపికకు తన భర్త శ్రీనివాస్ (రిటైర్డ్ లెక్చరర్) పూర్తిగా సహకరిస్తున్నారు.

ఆ మిషన్ మాకు సెంటిమెంట్

ఈ కుట్టు మిషన్‌ను గాంధీ తాత కుట్టు మిషన్‌గా పిలుచుకుంటాం. ఇది మాకు చాలా సెంటిమెంట్. సొసైటీ ఏర్పాటు చేశాక ఈ మిషన్‌తోనే శిక్షణ ప్రారంభించాం. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ కింద ఒకసారి రూ.5 లక్షలు, మరోసారి రూ.9 లక్షలు రుణం తీసుకుని 53 కుట్టుమిషన్లు కొనుగోలు చేసి నిరంతరం శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటివరకు 4వేల మందికి శిక్షణ ఇచ్చాం. ప్రతిఒక్కరికీ గాంధీ తాత కుట్టుమిషన్ మీదనే శిక్షణ మొదలు పెట్టాం. ఈ మిషన్ ద్వారా టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జూట్ బ్యాగుల తయారీ చేస్తున్నా. మా ముగ్గురు కుమారులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. వాళ్లతో పాటు వాళ్ల పిలలు సైతం ఈ మిషన్‌పై తరచూ కూర్చుంటారు.

– అయ్యవారు గోపిక, కపిల మహిళా సొసైటీ ఫౌండర్

సోయా పంటను పూర్తిగా కొనుగోలు చేస్తాం



వేల్పూర్‌లో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి

వేల్పూర్: జిల్లాలో సోయాబిన్ పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా పూర్తిగా కొంటామని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డితో కలిసి సోయాబిన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సోయాబిన్ పంటను 12 శాతం తేమ వచ్చేటట్లు ఆరబెట్టి కేంద్రాలకు తీసుకు రావాలని సూచించారు. జిల్లాలో బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో ఈ పంటను ఎక్కువగా సాగు చేశారన్నారు. మొక్కజొన్న పంటకు ప్రస్తుతం ఓపెన్ మార్కెట్‌లో క్వింటాలుకు సుమారు రూ.2300 మద్దతు ధర ఉందని, అంతకన్నా ధరను తగ్గిస్తే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, ఎంపీఐ సుభాష్, వేల్పూర్ సొసైటీ వైస్ చైర్మన్ శ్రీధర్, ఏఎంసీ డైరెక్టర్లు గొరాయి నరేందర్, బొంబాయి గంగాధర్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వరూప, మార్క్‌ఫెడ్ ఎండీ రంజిత్ కుమార్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ మేనేజర్ నగేశ్, ఏఎంసీ కార్యదర్శి మెర్సీ పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి ఎస్‌ఈగా వసంత్ నాయక్

నిజామాబాద్ నాగారం: ఆర్‌అండ్‌బీ శాఖ ఇన్‌చార్జి ఎస్‌ఈగా వసంత్‌నాయక్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం సంగారెడ్డి ఎస్‌ఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన గతంలో రెండు, మూడు సార్లు ఇన్‌చార్జి ఎస్‌ఈగా కొనసాగారు.

ఆస్తులు కాపాడుకోడానికే హైడ్రాపై విమర్శలు



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, తాహెర్ బిన్ హందాన్

- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఖలీల్‌వాడి: బీఆర్‌ఎస్ నేతలు తమ ఆస్తులు కాపాడుకోవడానికే హైడ్రాపై విమర్శలు చేస్తున్నారని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు చట్టబద్ధత కల్పించిందన్నారు. ఇప్పటి వరకు పేదల ఇళ్లు కూల్చలేదని చెప్పారు. మూసీ ప్రక్షాళనలో నష్టపోతున్న వారికి పరిహారం అందిస్తామన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగపడే ఒక పని చేయలేదని, ఆ పార్టీ నాయకులు ఇప్పుడు ప్రజల కోసం పని చేస్తున్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందడానికి బీఆర్‌ఎస్ నాయకులు రుణమాఫీ పేరిట నాటకం ఆడుతున్నారని విమర్శించారు. రూ.లక్ష రుణమాఫీ చేయని బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు విమర్శలు చేయడం వింతగా ఉందన్నారు.

యూనివర్సిటీ భూములు ఆక్రమిస్తే చర్యలు

తెలంగాణ యూనివర్సిటీ కోసం 577 ఎకరాలు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో కేటాయించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్, గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి, కేశ వేణు, సునీల్‌రెడ్డి, ముప్ప గంగారెడ్డి, వేణు రాజ్, విపుల్‌గౌడ్, సంతోష్, నరేందర్ గౌడ్, వేణుగోపాల్‌యాదవ్, పంచరెడ్డి చరణ్, లవంగ ప్రమోద్ పాల్గొన్నారు.

4న నగరానికి రానున్న పీసీసీ అధ్యక్షుడు

పీసీసీ అధ్యక్షుడిగా నియామకం అయ్యాక బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఈ నెల 4న జిల్లాకు తొలిసారి రానున్నారని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఆయన రాక సందర్భంగా నగరంలోని పాత కలెక్టరేట్‌లో సభనిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కేజీబీవీలో అధికారిణి బూతు పురాణం!

- సిబ్బందిని అసభ్య పదజాలంతో దూషిస్తున్న వైనం
- డీఈవోకు బాధితుల ఫిర్యాదు

నిజామాబాద్ అర్బన్: మాక్లూర్ కేజీబీవీలో ఓ అధికారిణి సిబ్బందితో ఇష్టారీతిగా మాట్లాడుతున్నారు. సదరు అధికారిణి సిబ్బందిపై అసభ్య పదజాలంతో మండిపడుతున్నారు. తోటి మహిళలు అని చూడకుండా విద్యార్థుల ముందే బూతులు తిడుతున్నారు. ఓ అధ్యాపకురాలు ఆమెను ప్రశ్నించగా ఇద్దరి మధ్య వివాదం పెరిగింది. మరో మహిళ కూడా సదరు అధికారిణిని మాటల విధానం సక్రమంగా లేదంటూ ప్రశ్నించగా ఆమెను కూడా ఇష్టానుసారంగా బూతులు తిట్టింది. మళ్లీ ఆమె స్థానిక ప్రజాప్రతినిధులను ఆశ్రయించింది. గతంలో ఇక్కడ అనేక అక్రమాలు జరిగాయని తాను వచ్చాక సక్రమం చేస్తున్నట్లు వారికి చెప్పింది. సిబ్బంది, అధ్యాపకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని సదరు ప్రజాప్రతినిధులను కోరినట్లు తెలిసింది. ఆమె తీరుతో వేగలేని సిబ్బంది జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అనంతరం కూడా సదరు అధికారిణి డీఈవోను అసభ్య పదజాలంతో తిట్టినట్లు సిబ్బంది పేర్కొన్నారు. విద్యార్థుల ఎదుటే సదరు అధికారి బూతులు మాట్లడటంపై ఉన్నతాధికారులు నివ్వెరపోతున్నారు.

విచారణ నివేదిక సమర్పించని అధికారిణి

అధికారిణి తీరుపై ఫిర్యాదు అందడంతో డీఈవో దుర్గాప్రసాద్ కేజీబీవీని సందర్శించి విచారణ చేయాలని జీసీడీవో భాగ్యలక్ష్మిని పంపించారు. అక్కడికి వెళ్లి విచారణ జరిపి పది రోజులవుతున్నా నేటి వరకు నివేదికను మాత్రం జిల్లా విద్యాశాఖ అధికారికి ఆమె అందించలేదు. అక్కడ సిబ్బంది సదరు మహిళ అధికారి తీరుపై విచారణ అధికారి ముందు గోడు వెల్లబోసుకున్నట్లు తెలిసింది. సదరు మహిళకు ఉపాధ్యాయ సంఘం నాయకుడి మద్దతు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

కేజీబీవీలో అసభ్య పదజాలంతో గొడవలు జరిగినట్లు నాకు ఫిర్యాదు అందింది. విచారణ చేపట్టాం. ఇందులో ఓ అధికారిణి తీరు ఏ మాత్రం బాగాలేదు. విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం. – దుర్గాప్రసాద్, డీఈవో

నిజాంసాగర్‌లోకి తగ్గిన ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో మంగళవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లను మూసివేసినట్లు నీటి పారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ఎగువ నుంచి 4,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు



(17.8 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 1,404.92 అడుగుల(17.687 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

ఫ్యామిలీ సర్వేను పక్కాగా నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి, సీఎస్ శాంతికుమారి

నిజామాబాద్ అర్బన్: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం ప్రయోగాత్మకంగా ఈ నెల 3 నుంచి చేపట్టనున్న సర్వేను పక్కాగా నిర్వహించాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే, నగరాలు, పట్టణ ప్రాంతాల విస్తరణకు ప్రతిపాదనలు, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారు కలెక్టర్లతో సమీక్షించారు. డిజిటల్ కార్డుల జారీకి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రెండు గ్రామాల్లో ప్రయోగాత్మక సర్వే నిర్వహించాలన్నారు. అర్బన్ నియోజకవర్గాలైతే రెండు డివిజన్లను ఎంపిక చేయాలని సూచించారు. ఇంటింటి పరిశీలన చేపట్టి, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించాలన్నారు. ఈ నెల 8 నాటికి సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. 9 న స్క్రూటినీ జరిపి, 10న సర్వేకు సంబంధించిన అన్ని అంశాలతో సమగ్ర నివేదిక పంపించాలని సూచించారు. ఆర్డీఓ/జోనల్ కమిషనర్ స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించి క్షేత్రస్థాయిలో సర్వే తీరును నిశితంగా పరిశీలన చేయాలన్నారు. సర్వే సందర్భంగా ఫ్యామిలీ ఫొటోను సేకరించడం తప్పనిసరి కాదని, ఫొటో కోసం ఎవరిని కూడా ఒత్తిడి చేయొద్దన్నారు. పైలెట్ సర్వే పూర్తయిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ కార్డుల జారీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సర్వేను పరిశీలించేందుకు ఉమ్మడి జిల్లాకు ఒక స్పెషల్ ఆఫీసర్ చొప్పున రాష్ట్రస్థాయి అధికారులు పర్యటిస్తారని పేర్కొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అధికారులు

లబ్ధిదారులను ఎంపిక చేయాలి

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి పొంగులేటి కలెక్టర్లకు సూచించారు. ఆయా ప్రాంతాలలో ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను దసరా కానుకగా అర్హులైన వారికి కేటాయించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన విధివిధానాలను ఒకటిరెండు రోజుల్లోనే పంపిస్తామన్నారు. ఈ నెల 15 నాటికి ప్రతి మండలంలో కనీసం ఒక కొనుగోలు కేంద్రాన్ని తప్పనిసరి ప్రారంభించాలన్నారు. ధాన్యం దిగుబడులను అనుసరిస్తూ అన్ని ప్రాంతాలలో రైతులకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న వరద

బాల్కొండ: ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 40604 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ఆరు వరద గేట్ల ద్వారా గోదావరికి 18,744 క్యూసెక్కుల నీటిని అధికారులు వదిలారు. ప్రాజెక్ట్‌ నుంచి ఆయకట్టు కోసం కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 6800 క్యూసెక్కులు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 1200, లక్ష్మి కాలువ ద్వారా 150, ఆవిరి రూపంలో 709, వరద కాలువ ద్వారా 12వేలు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతోంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్‌ నిండుకుండలా ఉంది.

గమ్మత్తయిన లాటరీ

- మేక, కోళ్లు, మద్యం బహుమతులు



రుద్రూర్‌: దసరా పండుగను పురస్కరించుకుని పొతంగల్‌ కొడిచర్ల గ్రామానికి చెందిన యువకులు గమ్మత్తైన లాటరీ ఏర్పాటు చేశారు. రూ. వంద కొట్టు.. మేకను పట్టు అని కొడిచర్ల గ్రామస్తులకు దసరా స్పెషల్‌ ఆఫర్‌ ఇస్తున్నట్లు క్యాప్షన్‌ పెట్టి టికెట్ల విక్రయాలు జరుపుతున్నారు. లాటరీ ధర రూ. వంద. లాటరీ విజేతలకు బహుమతులుగా ప్రథమ బహుమతి మేక, రెండో బహుమతి రెండు బ్లెండర్‌ స్ప్రైడ్‌ ఫుల్‌ బాటిళ్లు, మూడో బహుమతి కాటన్‌ బీర్లు, నాలుగో బహుమతిగా రెండు నాటు కోళ్లు, ఐదో బహుమతిగా ఒక రాయల్‌ స్టగ్‌ ఫుల్‌ బాటిల్‌ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దీన్ని చూసిన గ్రామస్తులు అధిక సంఖ్యలో వీటిలో కొనుగోలు చేస్తున్నారు.

కాపర్‌ కేటుగాళ్లు..



నందిపేటలో దొంగతనానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ (ఫైల్‌)

- పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు భద్రత కరువు
- కాపర్‌ వైరు ఎత్తుకెళ్తున్న దొంగలు
- ఏడాదిలో 31 ట్రాన్స్‌ఫార్మర్స్‌ ధ్వంసం
- అదనపు భారంతో ఇబ్బందుల్లో రైతులు

నందిపేట్‌: జిల్లాలో కాపర్‌ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. పొల్లాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తూ అందులోని కాపర్‌ తీగలను, ఆయిల్‌ను అపహరిస్తున్నారు. జిల్లాలో గత రెండేళ్లుగా డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్లలను ధ్వంసం చేస్తూ వచ్చే కొద్దిపాటి ధనానికి ఇటు రైతులకు, అటు విద్యుత్‌ శాఖకు నష్టాన్ని మిగిలుస్తున్నారు. గతంలో వీటిని ముట్టాలంటేనే భయపడేవారు. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసే కేటుగాళ్లు ఇందులో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి కాపర్‌ వైర్లను దొంగిలిస్తున్నారు.

వందల సంఖ్యలో..

గత రెండేళ్లలో జిల్లాలో సుమారు 150 వరకు డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ తీగలను దుండగులు దొంగిలించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 31 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారని విద్యుత్‌ అధికారులు చెబుతున్నారు. చిన్న ట్రాన్స్‌ఫార్మర్లలో 8 నుంచి 10 కిలోల రాగి తీగ ఉంటే, పెద్ద ట్రాన్స్‌ఫార్మర్లలో 15 నుంచి 20 కిలోల వరకు రాగి తీగలు ఉంటాయి. మార్కెట్లో రాగితీగ కిలో రూ. 400 నుంచి రూ. 500 వరకు ధర పలుకుతోంది. కానీ ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌ ధ్వంసంతో విద్యుత్తు శాఖకు రూ.15 వేలు నష్టం వాటిల్లుతోంది. కాపర్‌ తీగలను ఏర్పాటు చేసి మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్‌ బిగించాలంటే సుమారు రూ. 30 వేల వరకు భారం పడుతోంది. ఇళ్లలో దొంగతనం రిస్కుతో కూడుకున్న పని కావడంతో కష్టపడకుండా సులువుగా దొంగతనం చేసే మార్గం కావడంతో కేటుగాళ్లు వీటిపై దృష్టిసారించినట్లు జరిగిన ఘటనల ఆధారంగా తెలుస్తోంది.

గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలి

టాన్స్‌ఫార్మర్ల చోరీలను నియంత్రించాలంటే రైతులు విద్యుత్తు శాఖ సిబ్బందికి సహకారం అందిస్తూ.. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలి. పోలీసులు పెట్రోలింగ్‌ నిర్వహిస్తే దొంగతనాలను నివారించవచ్చు. విద్యుత్‌ అధికారులు సైతం ట్రాన్స్‌ఫార్మర్‌లకు నట్‌ బోల్టులకు బదులుగా వెల్డింగ్‌ చేస్తే దొంగల ముఠాకు కష్టంగా మారుతుంది. ఈ విధంగా చేస్తే కొంతవరకైనా దొంగతనాలు నివారించవచ్చు.

చర్యలు తీసుకుంటున్నాం

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతలకు వచ్చే ట్రాన్స్‌ఫార్మర్‌ మూతల చుట్టూ వెల్డింగ్‌ చేసేలా చర్యలు చేపడుతున్నాం. దొంగతనాల నివారణకు రైతులు, గ్రామ కమిటీ సభ్యులు విద్యుత్‌ శాఖకు సహకారం అందించాలి.

– రవీందర్‌, ఎస్‌ఈ, ట్రాన్స్‌కో

నాణ్యమైన విద్యుత్‌ అందించడమే లక్ష్యం

- విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్‌



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్‌: నగరవాసులకు నాణ్యమైన విద్యుత్‌ అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పని చేయాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఆర్‌ రవీందర్‌ సూచించారు. మంగళవారం నగరంలోని కంఠేశ్వర్‌లో ఉన్న ఉప కేంద్రంలో డి–5 సెక్షన్‌ పరిధిలో న్యూహౌసిగ్‌ బోర్డులో 8.0 ఎంవీఏ పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించగా, ఎస్‌ఈ రవీందర్‌ చార్జ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 8.0 ఎంవీఏ పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ద్వారా కంఠేశ్వర్‌, విద్యుత్‌ నగర్‌, హౌసింగ్‌ బోర్డు కాలనీ, మారుతినగర్‌, తారక రామానగర్‌, హైదరాబాద్‌ బైపాస్‌, ఆర్మూర్‌ రోడ్‌, చంద్రశేఖర్‌ కాలనీ, బంగారు మైసమ్మ, కస్తూరి గార్డెన్‌, డాక్టర్స్‌ కాలనీ, హనుమాన్‌ టెంపుల్‌, పలు ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్‌ అందుతుందని పేర్కొన్నారు. రూ.80లక్షల వ్యయంతో కొత్త పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌, ముబారక్‌నగర్‌, గూపన్‌పల్లి విద్యుత్‌ ఉపకేంద్రాల్లో మరమ్మతుల సమయంలో విద్యుత్‌ అంతరాయం లేకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈలు పీవీ రాజేశ్వర్‌రావు, ఎం శ్రీనివాస్‌రావు, ఏడీఈలు తోట రాజశేఖర్‌, నటరాజ్‌, చంద్రశేఖర్‌, వీరేశం, ఏఈలు అసరుద్దీన్‌, డి శ్రీనివాస్‌, ఆర్‌ సుమిత, గంగాశేఖర్‌, ఫోర్‌మన్‌, లైన్‌ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు నిజాముద్దీన్‌, గంగారాం, శ్రీనివాస్‌, రాంగోపాల్‌, నవీన్‌, ప్రేమ్‌దాస్‌, సంజీవ్‌, కమలాకర్‌, సుధాకర్‌, రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో సత్తా చాటిన చందర్‌ నాయక్‌



తెయూ(డిచ్‌పల్లి): సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో నిజామాబాద్‌ జిల్లా కోటగిరి మండలం సుద్దులం తండాకు చెందిన దేవసోత్‌ చందర్‌ రాథోడ్‌ ఉత్తమ ప్రతిభ చాటాడు. సాంఘిక శాస్త్రం విభాగంలో జిల్లాస్థాయిలో 37, ఎస్టీ కేటగిరిలో మొదటి ర్యాంకు సాధించాడు. ఇటీవల విడుదలైన హాస్టల్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్‌ ఫలితాల్లోనూ జోనల్‌ స్థాయిలో 1519, కేటగిరిలో 6వ ర్యాంకు సాధించాడు. ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై ఆయనను పలువురు అభినందించారు. కాగా చందర్‌ రాథోడ్‌ తెయూలో ఎల్‌ఎల్‌బీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలోనే వెలువడిన ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభతో మెరిశాడు.

పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి..

2018లో పంచాయతీ కార్యదర్శి ఫలితాల్లో ఉద్యోగం సాధించి రెండేళ్ల పాటు రుద్రూర్‌ మండలం రాయకూర్‌ గ్రామ పంచాయతీకి కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం డీఎస్సీ పరీక్షల నిమిత్తం కార్యదర్శి ఉద్యోగాన్ని పక్కన పెట్టి పరీక్షలకు సన్నద్ధమై స్కూల్‌ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్‌ ఎంపిక పోటీలు



ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొన్న క్రీడాకారులు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాస్థాయి మహిళ, పురుషుల హ్యాండ్‌ బాల్‌ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్‌ బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగమోహన్‌ చక్రు, పింజ సురేందర్‌ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం పురుషుల విభాగంలో 50, మహిళల విభాగంలో 30 మంది హాజరయ్యారని తెలిపారు. వీరిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 9, 10,11వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే 53వ రాష్ట్రస్థాయి సీనియర్‌ పురుషుల, మహిళా హ్యాండ్‌ బాల్‌ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌ బాల్‌ సంఘం కోశాధికారి గట్టడి రాజేశ్‌, పీఈటీలు సంజీవ్‌, రాజేందర్‌, ప్రిన్సిపాల్‌ పూర్ణచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీకి స్థల పరిశీలన



డిచ్‌పల్లిలో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి–ఘన్‌పూర్‌ గ్రామాల మధ్య ఉన్న రైల్వేగేటు వద్ద ఆర్‌యూబీ(రైల్వే అండర్‌ బ్రిడ్జి) నిర్మాణానికి మంగళవారం ఉదయం రైల్వే, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పోలీసు అధికారులు పరిశీలించారు. రానున్న రోజుల్లో రైళ్ల రాకపోకల సంఖ్య పెరిగే అవకాశం ఉండటం, వాహనదారుల ఇబ్బందులను తొలగించేందుకు ఆర్‌ యూబీ వంతెన నిర్మాణం తప్పనిసరిగా మారింది. నిర్మాణం కోసం గతేడాది నడిపల్లి పంచాయతీ పాలక వర్గం తీర్మాణం చేసి ఇచ్చారు. కాగా అధికారులు పరిశీలనకు రావడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

ఇందల్వాయి: రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇందల్వాయి రైల్వే గేటు, సిర్నాపల్లి రైల్వే గేట్‌ వద్ద రైల్వే ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణ పనుల సాధ్యాసాధ్యాలను సౌత్‌ సెంట్రల్‌ రైల్వే అధికారులు మంగళవారం పరిశీలించారు. స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీస్‌ సిబ్బంది సహకారంతో రైల్వే గేట్‌ పరిసరాలను పరిశీలించారు. తహసీల్దార్‌ వెంకట్రావు, ఆర్‌ఐ మోహన్‌, ఆర్‌ అండ్‌ బీ అధికారులు, పోలీసులు ఉన్నారు.

దసరా, బతుకమ్మ పండుగలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో 482 బస్సులు
- అక్టోబర్‌ 1 నుంచి 15 వరకు అమలు



జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రాంగణం

ఖలీల్‌వాడి: దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా వ్యాప్తంగా 482 అదనపు ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ప్రతి రోజు నిజామాబాద్‌ నుంచి జేబీఎస్‌కు ప్రతి 15 నిమిషాలకు ఓ బస్సు అందుబాటులో ఉంటుంది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఈనెల 1 నుంచి 15 వరకు అదనంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 482 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. రీజియన్‌లోని ఆరు డిపోలు నిజామాబాద్‌–1, నిజామాబాద్‌–2, బోధన్‌, ఆర్మూర్‌, బాన్సువాడతోపాటు కామారెడ్డి నుంచి జేబీఎస్‌ వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. అలాగే ఇతర ప్రధాన రూట్లలో కూడా ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్‌ కోసం www.tsrtcoline.in అనే వెబ్‌సైట్‌ లో రిజర్వేషన్‌ చేసుకోవాలి.

ప్రత్యేక బస్సుల వివరాల కోసం..

ఆర్మూర్‌	7382843133
బోధన్‌	9849500725
నిజామాబాద్‌	9959226022
బాన్సువాడ	9491105706
కామారెడ్డి	8468220281

ప్రయాణికులకు అనుకూలంగా..



దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా వ్యాప్తంగా మొత్తం 482 ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నాం. ప్రయాణికులకు అనుకూలంగా బస్సులను అందుబాటులో ఉంచుతాం. హైదరాబాద్‌ జేబీఎస్‌లో సైతం ఉమ్మడి జిల్లా ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ప్రత్యేక అధికారులను నియమించాం. రద్దీ ప్రాంతాల్లో బస్సులను ఆపాలని డ్రైవర్‌, కండక్టర్లకు సూచించాం.

– జానీరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం, నిజామాబాద్‌

సమన్వయంతోనే ఉత్తమ ఫలితాలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: సమన్వయంతోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. సెప్టెంబర్‌ 28న నిర్వహించిన జాతీయ లోక్‌ అదాలత్‌ విజయవంతమైన నేపథ్యంలో నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ కార్యాలయంలోని సమావేశ హాల్‌లో మంగళవారం నిర్వహించిన లోక్‌ అదాలత్‌ సక్సెస్‌ మీట్‌లో ఆమె మాట్లాడారు. లోక్‌ అదాలత్‌ను విజయవంతం చేయడానికి పోలీస్‌ శాఖ చాలా శ్రమించిందని ప్రశంసించారు. పన్నెండు వేల రాజీపడదగిన క్రిమినల్‌ కేసులను లోక్‌ అదాలత్‌లో పరిష్కరించుకోవడం గొప్ప విషయమన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తూ సమన్వయ పర్చుకుని తక్కువ సమయంలో ఎక్కువ క్రిమినల్‌ కేసుల పరిష్కారంలో భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. జ్యుడీషియల్‌, పోలీస్‌ శాఖ మధ్య సమన్వయం భవిష్యత్‌ లోక్‌ అదాలత్‌లకు ప్రేరణగా నిలవాలని ఆమె ఆశించారు. పోలీస్‌ కమిషనర్‌ కల్మేశ్వర్‌ మాట్లాడుతూ.. ప్రణాళిక ప్రకారమే పోలీస్‌ శాఖ సమన్వయం చేసుకుని లోక్‌ అదాలత్‌ విజయంలో తన పాత్రను పోషించిందని తెలిపారు. సైబర్‌ నేరాల్లో క్రియాశీలకంగా వ్యవహరించి బాధితులకు అండగా నిలిచినట్లు పేర్కొన్నారు. సమావేశం అనంతరం పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు జిల్లా జడ్జి, సీపీ ప్రశంస పత్రాలు అందజేశారు. సమావేశంలో అదనపు డిప్యూటీ పోలీస్‌ కమిషనర్‌ (అడ్మినిస్ట్రేషన్‌) కోటేశ్వరరావు, అదనపు డిప్యూటీ పోలీస్‌ కమిషనర్‌(ఎ ఆర్‌) శంకర్‌ నాయక్‌, నిజామాబాద్‌, ఆర్మూర్‌, బోధన్‌ అసిస్టెంట్‌ పోలీస్‌ కమిషనర్లు రాజా వెంకటరెడ్డి, వెంటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌, ట్రాఫిక్‌ అసిస్టెంట్‌ పోలీస్‌ కమిషనర్‌ నారాయణ, ఎస్‌బీ అసిస్టెంట్‌ పోలీస్‌ కమిషనర్‌ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ లక్ష్మీనర్సయ్య, అసిస్టెంట్‌ పోలీస్‌ ప్రాసిక్యూటర్స్‌ మహమ్మద్‌ రహీమొద్దీన్‌, రాజేశ్‌ గౌడ్‌, రాణి, జిల్లా కోర్టు లైజన్‌ అధికారి శ్యామ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

తల్లిని చంపిన కొడుకుకు మూడేళ్ల జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: తల్లిని చంపిన కొడుకుకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్‌ శ్రీనివాస్‌ నాయక్‌ గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దకొడప్‌గల్‌కు చెందిన వడ్డె నాగవ్వ(48) 2021మార్చి31న దారుణ హత్యకు గురైంది. డబ్బులు అడిగితే ఇవ్వలేదని మద్యానికి బానిసైన ఆమె కొడుకు నర్సింలు కన్న తల్లి అని కూడా చూడకుండా కర్రతో దాడి చేసి హతమార్చాడని పోలీసుల విచారణలో తేలింది. అప్పట్లోనే పోలీసులు నిందితుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. కేసు పూర్వపరాలను పరిశీలించిన అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్‌ శ్రీనివాస్‌ నాయక్‌ నిందితుడు నర్సింలుకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.5 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. కేసును విచారించిన బిచ్కుంద సీఐలు చంద్రశేఖర్‌, నరేశ్‌కుమార్‌, ఎస్సై విజయ్‌ కొండ, మహేందర్‌, మురళి, పీపీ రాజగోపాల్‌ గౌడ్‌, పోలీసు సిబ్బంది మురళీకృష్ణ, విక్రంరెడ్డిలను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

బిచ్కుంద: మండల కేంద్రంలో గత నెల 29న జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం బిచ్కుంద పీఎస్‌లో బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బిచ్కుందకు చెందిన గుడ్లింగం పండరి మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. అదే ప్రాంతానికి చెందిన గోనె కాశవ్వ గత నెల 29న ఇంట్లో ఒక్కరే ఉన్నట్లు గుర్తించి ఆమె మెడలో ఉన్న బంగారాన్ని దొంగిలించి రోకలి బండతో ఆమె తలపై బలంగా కొట్టాడు. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ నరేశ్‌, ఎస్సై మోహన్‌రెడ్డి కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడు పండరిగా పోలీసులు గుర్తించారు. పండరి ఫత్లాపూర్‌ దాబా వద్ద ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లి పట్టుకున్నారు. విచారణలో కాశవ్వను హత్య చేసి బంగారం చోరీ చేసినట్లు పండరి నిజం ఒప్పుకున్నాడు. బంగారు నగలు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

దూదిగాంలో చైన్‌ స్నాచింగ్‌

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం వద్ద ఓ మహిళ మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌ జిల్లా గొల్లపేట్‌కు చెందిన సంద స్వప్న తన కుమారుడిని దూదిగాంలో ఉన్న సీఎస్‌ఐ హాస్టల్‌ నుంచి దసరా సెలవుల కోసం ఇంటికి తీసుకెళ్లేందుకు మంగళవారం మధ్యాహ్నం వచ్చింది. ఈ క్రమంలో జాతీయ రహదారి 44 రోడ్డును క్రాస్‌ చేసేందుకు నిర్మించిన వంతెన కిందకు రాగానే వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

రుద్రూర్‌: మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న మంగళవారం తెలిపారు. సోమవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్‌ షాక్‌తో గేదె మృతి

లింగంపేట: మండలంలోని భవానిపేట గ్రామానికి చెందిన కత్తూరి కిషన్‌ పాడి గేదె మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రోజువారిగా గ్రామ శివారులోని పంట చేనుల్లో మేతకు వెళ్లిన గేదెపై సర్వీసు వైరు తెగిపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ట్రాన్స్‌కో అధికారులు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

బోధన్‌లో ఆవుల చోరీకి విఫలయత్నం



ఆవులకు వైద్యం అందిస్తున్న వైద్యులు

బోధన్‌రూరల్‌: పట్టణంలోని శ్రీచక్రేశ్వర శివాలయం సమీపంలోని ఏకచక్రేశ్వర గోశాలకు చెందిన మూడు ఆవులను దుండగులు మత్తుమందు ఇచ్చి ఎత్తుకెళ్లేందుకు యత్నించిన ఘటన బోధన్‌ పట్టణంలో మంగళవారం కలకలం రేపింది. ఘటనకు సంబంధించి చక్రేశ్వర గోశాల ప్రతినిధులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గోశాలలోని ఆవులు ఆలయ సమీపంలోని డివైడర్లకు ఇరువైపులా సంచరిస్తు నిద్రిస్తుంటాయి. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో రోడ్డుపై నిద్రిస్తున్న మూడు ఆవులను దుండగులు మత్తు మందు ఇచ్చి ఓ వాహనంలో ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. గమనించిన చుట్టపక్కల వారు కేకలు వేసి గోశాల ప్రతినిధులకు సమాచారం అందించారు. వెంటనే గోశాల అధ్యక్షుడు నేపాల్‌ సింగ్‌, ప్రతినిధులు అక్కడికి చేరుకోగా దుండగులు వెంట తెచ్చుకున్న వాహనంతో అక్కడి నుంచి పరారయ్యారు. మత్తు మందుతో మూడు ఆవులు అపాస్మరకస్థితిలో ఉన్నట్లు గుర్తించిన గోశాల ప్రతినిధులు వెంటనే గోపాలమిత్ర వారిని పిలిపించి చికిత్స అందించారు. ఈ విషయమై గోరక్ష సేవా సమితి అధ్యక్షుడు నేపాల్‌ సింగ్‌, ప్రధాన కార్యదర్శి వినోద్‌ పట్వారీ పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టణ సీఐ వెంకటనారాయణ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని, సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

10 లక్షలతో పోస్టల్‌ ఉద్యోగి పరార్‌

- పోలీసులకు ఫిర్యాదు

బీబీపేట: పోస్టల్‌ శాఖలో పనిచేస్తూ మూడు నెలల క్రితం సస్పెన్షన్‌కు గురైన ఓ ఉద్యోగి.. రూ. 10 లక్షల పెన్షన్‌ డబ్బులతో పరారయ్యాడు. ఎస్సై ప్రభాకర్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వర్ని మండలం సిద్దులం తండాకు చెందిన దేవిసోత్‌ బిక్యా నాయక్‌ తుజాల్‌పూర్‌ గ్రామ బ్రాంచ్‌ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేసేవాడు. పోస్టాఫీస్‌ డబ్బులను పక్కదారి పట్టించిన విషయంలో జూన్‌ 6న సస్పెన్షన్‌కు గురయ్యాడు. దీంతో ఇస్సానగర్‌ బ్రాంచ్‌ పోస్ట్‌మాస్టర్‌ బట్టు అనిల్‌కు తుజాల్‌పూర్‌ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. గతనెల 30న ఇస్సానగర్‌, తుజాల్‌పూర్‌ గ్రామాలకు సంబంధించిన చేయూత పెన్షన్‌ పంపిణీ కోసం బట్టు అనిల్‌ రూ. 10 లక్షలు బీబీపేట సబ్‌ పోస్టుమాస్టర్‌ వద్దనుంచి తీసుకున్నాడు. ఆ డబ్బులను తీసుకుని వెళ్లి బీబీపేటలో బిక్యా నాయక్‌ అద్దెకు ఉంటున్న ఇంట్లో భద్రపరిచి, ఇస్సానగర్‌ వెళ్లాడు. మంగళవారం ఉదయం పెన్షన్లు పంపిణీ చేయడం కోసం బిక్యా గదికి వెళ్లగా.. తాళం వేసి ఉంది. అతడికి ఫోన్‌ చేయగా స్విచ్‌ ఆఫ్‌ అని వస్తుండడంతో ఆందోళనతో పోస్టల్‌ ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. బిక్యాతో పాటు అతడి స్నేహితుడు సురేశ్‌ డబ్బులు తీసుకుని పారిపోయారని, వారిపై చర్యలు తీసుకోవాలని బీబీపేట సబ్‌ పోస్టుమాస్టర్‌ నర్సింలు ఫిర్యాదు చేశారని ఎస్సై ప్రభాకర్‌ తెలిపారు.

చేపల వేటలో వివాదం



ఏడీఏతో వాగ్వాదం చేస్తున్న మత్స్యకారులు

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా చేసే వరద కాలువలో చేపల వేట కోసం కొంత కాలంగా మత్స్యకారుల మధ్య వివాదం జరుగుతుండడంతో మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులు కాలువ హెడ్‌ రెగ్యులేటర్‌ను మంగళవారం పరిశీలించారు. ముప్కాల్‌ మండల శివారులోని వరద కాలువలో ముప్కాల్‌ గ్రామస్తులు కాకుండా ఇతర గ్రామస్తులు చేపల వేట కొనసాగద్దని వివాదం జరుగుతోంది. సమస్యను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా అధికారితో ఇరువర్గాల మత్స్యకారులు వాగ్వాద పడ్డారు. అసలు వరద కాలువ బాల్కొండ మండలం బస్సాపూర్‌ శివారులో ఉందని మత్స్యకారులు కొందరు వాదించారు. దీంతో ల్యాండ్‌ సర్వే డిపార్ట్‌మెంట్‌కు అప్పగించి, సర్వే చేయిస్తామని ఏడీ తెలిపారు. సమస్య పరిష్కారానికి ఇరువర్గాల మత్స్యకారులు సహకరించాలని కోరారు.

వృద్ధులను గౌరవించాలి



నిజామాబాద్‌ నాగారం: సమాజంలో ప్రతి ఒక్కరు వృద్ధులను గౌరవించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. పాత కలెక్టరేట్‌ వద్ద ఈ ర్యాలీని జెండా ఊపి జడ్జి ప్రారంభించారు. వృద్ధుల హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. వృద్ధుల సంరక్షణ చట్టం, నిబంధనలపై వివరించారు. వృద్ధులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మేయర్‌ నీతూకిరణ్‌ అన్నారు. అనంతరం జిల్లా సంక్షేమ శాఖ అధికారి రసూల్‌బీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు వృద్ధులకు అందేలా చూస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సూదం లక్ష్మి, ఆంజనేయులు, రామ్మోహన్‌, రాజేశ్వర్‌, దారం గంగాధర్‌, అశోక్‌, నారాయణరెడ్డి, చిటుకుల భూమయ్య, ఆడెపు మనోహర్‌, రాజుగౌడ్‌, పల్లెపు సత్యనారాయణ, లాలన వృద్ధాశ్రమ నిర్వాహకురాలు సునీత పాల్గొన్నారు.

రైతు వేదికల్లో ఏఈవోల నిరసన



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): అటెండెన్స్‌ నమోదు కాకుండా ప్రభుత్వం లాగర్‌ యాప్‌ సేవలను నిలిపివేయడంపై వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మండిపడుతున్నారు. డిజిటల్‌ క్రాప్‌ సర్వేను చేయనందుకు ప్రభుత్వం తమపై ఈ విధంగా కక్ష కట్టడం సరికాదని ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌ నాయక్‌ అన్నారు. విధులకు హాజరవుతూ ప్రభుత్వ కార్యక్రమాలు చేపడుతున్నా కూడా అటెండెన్స్‌ వేసుకోనివ్వకుండా చేయడంపై మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఏఈవోలు నిరసన తెలిపారు. మండలాల్లో ఉన్న రైతు వేదికల్లో జరిగిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించారు. డిజిటల్‌ క్రాప్‌ సర్వేపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ సహాయకులను నియమిస్తే సర్వే చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పక్క రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను తెలంగాణలో కూడా అనుసరించాలని కోరుతున్నా కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. క్షేత్ర స్థాయిలో రుణమాఫీ కాని కుటుంబ సభ్యుల నిర్ధారణ, పంటల పరిశీలన, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నా కూడా విధులకు గైర్హాజరైనట్లు పరిగణించడం సరికాదన్నారు. లాగర్‌ యాప్‌ను డౌన్‌లోడ్‌ చేస్తే డిజిటల్‌ క్రాప్‌ సర్వే యాప్‌ డౌన్‌లోడ్‌ అవుతుందని, ప్రభుత్వం దీనిపై స్పందించి ఏఈవోలకు అనుకూలమైన నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు.

రేపు ఫుట్‌బాల్‌ బాలుర జట్టు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని నాగారంలో ఉన్న రాజారాం స్టేడియంలో ఈ నెల 3న గురువారం స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ అండర్‌–19 విభాగంలో బాలుర జట్టుకు ఎంపికలు నిర్వహించనున్నట్లు డీఐఈవో రవికుమార్‌ మంగళవారం పేర్కొన్నారు. ఇంటర్‌ చదివే క్రీడాకారులు బోనాఫైడ్‌తో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9441631631 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి దసరా సెలవులు

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు బుధవారం నుంచి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఇదివరకే పరీక్షలు నిర్వహించిన విద్యాశాఖ దసరా సెలవులు మంజూరు చేసింది. తిరిగి పాఠశాలలు ఈనెల 15న ప్రారంభం కానున్నాయి. ప్రయివేట్‌, ప్రభుత్వ పాఠశాలలు అన్నింటికీ సెలవులు వర్తిస్తాయని డీఈవో దుర్గాప్రసాద్‌ పేర్కొన్నారు.